

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(న్యూసిటీ), జూలై 11: ఉమ్మడి జిల్లాలోని బీడి, సున్నపురాయి, డోలమైటు గని కార్మికుల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని బీడి కార్మిక సంక్షేమ నిధి వైద్యశాఖ అధికారి డాక్టర్ కిషోర్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల పిల్లలు ఆన్‌లైన్‌లో నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు అక్టోబరు 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం హెల్ప్‌లైన్ నెంబరు 0120-6619540, 040-29561297కు సంప్రదించాలన్నారు.

జగన్ నిర్లక్ష్యం.. ప్రాజెక్టులు నిర్వీర్యం..!

- వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ఖరీదు రూ.700 కోట్లు!
- వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు ఆపేసిన పాపం
- 2019లో చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం
- వైసీపీ రాగానే నిధులు లేక ఆగిపోయిన పనులు
- నూతన ఎస్ఎస్ఆర్ రేట్లు ఇవ్వాలంటున్న కాంట్రాక్ట్ సంస్థలు
- ప్రభుత్వ ఖజానాపై రూ.వందల కోట్లు అదనపు భారం

గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం జిల్లా రైతాంగానికి శాపంగా మారింది. అప్పట్లో జగన్ తీసుకున్న అడ్డుగోలు నిర్ణయాల వల్ల రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు గ్రహణం పట్టుకుంది. పశ్చిమ పల్లెసీమలు కరువు నివారణ ప్రాజెక్టులైన వేదవతి ఎత్తిపోతల పథకం, ఆర్డీఎస్ కుడి కాలువ పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఫలితంగా నిర్మాణ వ్యయం పెరిగి ఖజానాకు భారంగా మారింది. జగన్ సర్కారు ఏటేటా నిధులు ఇచ్చి యథాతథంగా పనులు కొనసాగించి ఉంటే రూ.3,927 కోట్లతో పనులు ఇప్పటికే పూర్తయ్యేవి. పశ్చిమ ప్రాంతం కరువు నేలకు సాగునీరు అందేవి. అదే జరిగితే మంచిపేరు (క్రెడిట్) చంద్రబాబుకు దక్కుతుందనే అక్కసుతో నిధులు ఇవ్వకుండా కాంట్రాక్ట్ సంస్థలు పనులు ఆపేశాల చేసింది. టీడీపీ అధికారంలోకి రాగానే పాత ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి సారించింది. జగన్ ప్రభుత్వం ఆపేసిన ప్రాజెక్టుల తాజా పరిస్థితిపై నివేదికలు కోరినట్లు తెలిసింది. జిల్లా పశ్చిమ ప్రాంతం ప్రాణాధారమైన వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ పనులు చేపట్టాలంటే నూతన ఎస్ఎస్ రేట్లు ఇవ్వాలని కాంట్రాక్ట్ సంస్థలు తేల్చేసినట్లు సమాచారం. అదే జరిగితే సరాసరి రూ.675-700 కోట్లకు పైగా అంచనా వ్యయం పెరిగే అవకాశం ఉందని ఆ శాఖ అధికారుల ద్వారా తెలుస్తోంది.



ఆర్డీఎస్ ఆనకట్ట (ఫైల్)

కర్నూలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశ్చిమ ప్రాంతం కరువుకు నిలయం. ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాలను ఆనుకొని తుంగభద్ర, వేదవతి, హంద్రీ నదులు ప్రవహిస్తున్నా.. అన్నదాతలు వర్షంపైనే ఆధారపడాల్సిన దైన్యపరిస్థితి ఉంది. వానొస్తే పంట.. లేదంటే అప్పుల మంట. ఇది కరువు రైతుల దీనస్థితి. ఏటా వర్షాభావ పరిస్థితులు.. కరువు దరువేస్తుండడంతో వలసలే శరణ్యమయ్యాయి. ఈ పరిస్థితుల్లో కరువు, వలసలు నివారణ ప్రధాన లక్ష్యంగా 2019లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టు, ఆర్డీఎస్ రైట్ బ్యాంక్ కెనాల్‌కు శ్రీకారం చుట్టింది. హాలహర్వి మండలం గూళ్యం సమీపంలో వేదవతి నది నుంచి హాలహర్వి, మొలగవెల్లి వద్ద నిర్మించే జలాశయాల్లోకి 8 టీఎంసీలు ఎత్తిపోసి ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలుకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు ఇవ్వవచ్చని రిటైర్డ్ ఇంజనీరింగ్ నిపుణుడు సుబ్బరాయుడు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. దీనిని 4 టీఎంసీలకు కుదించి ఆనాటి కర్నూలు ఇరిగేషన్ ప్రాజెక్టుల సీఈ నారాయణరెడ్డి (ప్రస్తుత ఈఎన్‌సీ) పంపిన డీపీఆర్ ప్రకారం ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం రూ.1,942.38 కోట్లు మంజూరు చూస్తూ 2019 జనవరిలో జీవో.ఆర్‌టీ.నెం.77 జారీ చేసింది. గూళ్యం సమీపంలో వేదవతి ఒడ్డున స్టేజ్-1 పంపింగ్ స్టేషన్, మద్దికెర సమీపంలో హంద్రీనీవా కాలువపై స్టేజ్-2 పంపింగ్ స్టేషన్ నిర్మించాలి. ఇటు వేదవతి, అటు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు వినియోగించుకునేలా డిజైన్ చేశారు. అలాగే మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లోని కోసిగి, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, సి.బెళగల్, గూడూరు, కల్లూరు, కర్నూలు మండలాల్లో 40 వేల ఎకరాలకు సాగుతో పాటు పలు గ్రామాలకు తాగునీరు అందించాలన్న లక్ష్యంగా రూ.1,985.42 కోట్లు మంజూరు చేస్తూ 2019 జనవరి 20న జీవో ఆర్‌టీ నెం.76 జారీ చేసింది. టెండర్లు కూడా నిర్వహించారు. వేదవతి ప్రాజెక్టు పనులు మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ, ఆర్డీఎస్ కుడి కాలువ పనులు ఎన్‌సీసీ లిమిటెడ్ సంస్థ పనులు చేపట్టారు.


హంద్రీనీవా కాలువ ఒడ్డున అసంపూర్తిగా వేదవతి ప్రాజెక్టు స్టేజ్-2 ఎత్తిపోతల పథకం హెడ్ వర్క్ పనులు

సగంలోనే ఆగిన పనులు

వేదావతి వేదవతి ప్రాజెక్టులో భాగంగా కాంట్రాక్ట్ సంస్థ ప్రెజర్ మెయిన్ పైపులైన్-1, ప్రెజర్ మెయిన్ పైపులైన్-3 పనులు, హంద్రీనీవా కాలువ ఒడ్డున స్టేజ్-2 ప్రధాన లిఫ్టు పనులు చేపట్టి రూ.90 కోట్లు ఖర్చు చేస్తే.. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేసింది. కోసిగి మండలం సాతనూరు సమీపంలో ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్ పనులు చేపట్టారు. దాదాపు 4.75 శాతం పనులు పూర్తి చేశారు. ఇక్కడ కూడా బిల్లులు రాకపోవడం నిర్మాణ పనులు ఆపేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఆనాటి ఆ పార్టీ ఎమ్మెల్యేలు పట్టించుకోలేదు. గత జగన్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించడం వెరసి నాలుగేళ్లుగా పనులు ఆగిపోయాయి. మళ్లీ పనులు చేపట్టాలంటే నూతన ఎస్ఎస్ఆర్ రేట్లు ఇస్తే ఇవ్వాల్సిందేనని కాంట్రాక్ట్ సంస్థలు తేల్చిచెప్పినట్లు సమాచారం.

జగన్ నిర్వాకంతో ఖజానాపై పెనుభారం

వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టుల అంచనాలు 2018-19 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం అంచనా వేసి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) ప్రభుత్వానికి పంపించినట్లు ఓ ఇంజనీరు పేర్కొన్నారు. ఆ ప్రకారం రెండు ప్రాజెక్టులకు చంద్రబాబు ప్రభుత్వం రూ.3,927.80 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ఎస్టిమేట్ కాంట్రాక్ట్ విలువ (ఈసీవీ) సుమారుగా రూ.3,350 కోట్లు ఉంటుందని అంచనా. ప్రస్తుతం లేబర్, సిమెంట్, స్టీల్ (ఇనుము), డీజిల్.. వంటి రేట్లు భారీగా పెరిగాయి. తాజాగా 2024-25 ఎస్ఎస్ఆర్ రేట్లు అమలులోకి వస్తున్నాయని ఇంజనీర్లు అంటున్నారు. అంటే ఐదేళ్ల క్రితం ఉన్న ధరలతో పోలిస్తే తాజాగా 20 శాతానికిపైగా రేట్లు పెరిగాయి. నూతన ఎస్ఎస్ఆర్ రేట్లు ఇవ్వాలని, లేని పక్షంలో పనులు చేయలేమంటూ కాంట్రాక్ట్ సంస్థలు తేల్చిచెప్పినట్లు ఇంజనీరింగ్ అధికారుల ద్వారా తెలుస్తోంది. ఆ సంస్థలు ఆసక్తి చూపకపోతే కాంట్రాక్ట్ రద్దు చేసి తాజా ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం మళ్లీ ప్రతిపాదనలు తయారు చేసి టెండర్లు పిలవాల్సి ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు. మళ్లీ టెండర్లు పిలిచినా, ఉన్న కాంట్రాక్ట్ సంస్థలనే నూతన ఎస్ఎస్ఆర్ రేట్లు ప్రకారం పనులు చేసేందుకు ఒప్పించినా ఖజానాపై సరాసరి రూ.675-700 కోట్లకు పైగా సర్కారు ఖజానాపై అదనపు భారం పడుతుంది. ఈ వ్యయం మరింత పెరిగే అవకాశం కూడా లేకపోలేదు. అదే క్రమంలో భూ సేకరణ విలువ కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. గత జగన్ ప్రభుత్వం సకాలంలో పనులు చేసి ఉంటే పరిస్థితి ఉండేది కాదు. టీడీపీ ప్రభుత్వంలోనైనా ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కరువు, వలసల నివారణ ప్రాజెక్టులు పూర్తి చేసి పశ్చిమ ప్రాంత కరువు రైతులు కన్నీళ్లు తుడవాలని పలువురు కోరుతున్నారు.


అసంపూర్తిగా ఆగిన ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్ పనులు

ఉర్దూ వర్సిటీలో ప్రవేశానికి గడువు పొడిగింపు

కర్నూలు(అర్బన్), జూలై 11: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ నాలుగేళ్ల హానర్స్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 20 వరకు గడువు పొడిగించామని రిజిస్ట్రార్, ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు తెలిపారు. 23వ తేదీ నుంచి 26లోగా విద్యార్థులు తమ వెబ్ ఆప్షన్స్‌లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ అని ఎంపిక చేసుకోవాలని తెలిపారు. 31వ తేదిన విద్యార్థులకు సీట్ల కేటాయింపులు జరుగుతాయని, వెంటనే కళాశాలలో రిపోర్ట్ చేయాలని, అదే రోజు నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

వలసల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్



కర్నూలు(కలెక్టరేట్), జూలై 11: అర్హులైన పేదలందరికీ ఉపాధి పనులు కల్పించాలని, వలసల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా డ్వామా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, ఉపాధి హామీ పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పనుల కల్పనలో జిల్లా చాలా వెనుకబడి ఉందన్నారు. కుటుంబానికి సగటున ఉపాధి కల్పనలో కర్నూలు జిల్లా 26.93 శాతంతో 25వ స్థానంలో ఉందని, అలాగే పనిదినాలు కల్పించడంలో 99 శాతంతో 15వ స్థానంలో ఉందని తెలిపారు. రాయలసీమ ప్రాంతమైన కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ పనులు కల్పించడంలో వెనుకబడి ఉంటే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. వాటర్ షెడ్ ప్రాజెక్టుల సమీక్షలో భాగంగా వాటర్ షెడ్ ప్రాజెక్టుల కింద ప్లాంటేషన్ పనులే కాకుండా రైతులకు మరింత లాభసాటిగా ఉండేలా, పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో అన్ని వీధి దీపాలు వర్కింగ్ కండీషన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. ఏఎన్ఎంలు నీటి నిల్వ ఉన్న ప్రదేశాలు, శానిటేషన్ సరిగ్గా లేని ప్రదేశాలను ఫొటోలు తీసి వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన సమస్యలు పెండింగ్‌లో లేకుండా పంచాయతీ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి, డీపీవో నాగరాజునాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్, డ్వామా ఏపీడీలు, పంచాయతీరాజ్ డీఈలు, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులను వదిలే ప్రసక్తే లేదు

ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే

ఆదోని రూరల్, జూలై 11: భూకబ్జాలకు పాల్పడేవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి స్పష్టం చేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'వైసీపీ కబ్జాలో అమరావతినగర్' కథనానికి ఆయన స్పందించారు. వెంటనే అధికారులతో సమావేశమై కబ్జాకు గురైన మున్సిపల్ పార్క్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, తహసీల్దార్ హసీనా సుల్తానా, సర్వేయర్ రమణ, టీపీఓలతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. అమరావతి నగర్‌లోని కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలంపై ఆరా తీశారు. పార్కు స్థలానికి సంబంధించిన ఎవరికైనా పట్టాలు ఇచ్చారా? ప్లాట్లు వేయడానికి అనుమతులు ఇచ్చారా? అంటూ అధికారులను ప్రశ్నించారు. స్థలానికి సంబంధించిన ఏ ఒక్కరికి పట్టాలు ఇవ్వలేదని ఎమ్మెల్యేకు తెలిపారు. వెంటనే పార్కు స్థలాన్ని అధికారులు స్వాధీనం పరచుకోవాలని, పార్కు స్థలం మొత్తానికి కంచె వేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.



మూడో రోజూ నిరాశే..!

- రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ బృందం
- వాసంతికి బాసటగా ప్రజా సంఘాలు
- ఉదయం నుంచి ఘటన స్థలంలోనే ఎంపీ బైరెడ్డి
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్


గాలింపు చర్యలు చేపట్టిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

నందికొట్కూరు/ పగిడ్యాల, జూలై 11: ఐదు రోజుల క్రితం అదృశ్యమైన చిన్నారి వాసంతి మృతదేహం కోసం ముచ్చుమర్రి అప్రోచ్ కెనాల్‌లో మూడో రోజు కూడా గాలింపు చర్యలు కొనసాగాయి. గురువారం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్) 30 మందితో కూడిన బృందం అత్యాధునిక టెక్నాలజీతో కూడిన కెమెరాలతో నీటిలో తనిఖీ చేశారు. కానీ వాసంతి మృతదేహం లభించలేదు. ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే ఉంటూ నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ రాజకుమారి సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. గాలింపుచర్యలకు సంబంధించిన ఏర్పాట్లు, కేసు దర్యాప్తు విషయాలపై ఆమె ఎస్పీ రఘువీర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పాప అదృశ్యమై ఐదు రోజులవుతున్నా ఆచూకి లభించడం లేదని వాసంతి కుటుంబ సభ్యులు, వారి బంధువులు కలెక్టర్ ఎదుట వాపోయారు. అనుమానితులుగా ఉన్న ముగ్గురు మైనర్ బాలురు తప్పుడు సమాచారంతో పోలీసులను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. చంపి పడేసిన ప్రదేశాన్ని కరెక్టుగా చూపిస్తే... మా పాపను మేము తీసుకెళ్లి దహనసంస్కారాలు చేసుకుంటామంటూ కలెక్టర్ ఎదుట వాసంతి తల్లిదండ్రులు బోరున విలపించారు. చిన్నారి ఆచూకి ఈ రోజైనా తెలుస్తుందని గ్రామస్తులు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువ వద్దకు చేరుకున్నారు. గాలింపు చర్యలు మూడు రోజులకు చేరినా కూడా లభ్యం కాకపోవడంతో ఈ అప్రోచ్ కాలువలో శవం వేయలేదన్న అనుమాలను కుటుంబ సభ్యులు, బంధువులు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ గాలింపు చర్యలతో పాటు మరో కోణంలో కూడా దర్యాప్తు చేస్తే ఫలితం ఏమైనా ఉంటుందన్న అభిప్రాయాలను కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు.


కలెక్టర్‌తో మాట్లాడుతున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి డా.శబరి

బాసటగా ప్రజా సంఘాలు

వాసంతి ఆచూకీ ఐదు రోజులుగా లభించకపోవడంతో ప్రజా సంఘాల నాయకులు ఆందోళనలకు దిగారు. నందికొట్కూరులో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన కార్యక్రమం చేపట్టారు. కలెక్టర్ రాజకుమారికి, ఎస్పీ రఘువీర్‌రెడ్డికి వాల్మీకి సంఘం నాయకులు, సీపీఐ నాయకులు, సీపీఎం నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. వాసంతి మృతదేహాన్ని త్వరితగతిన వెలికి తీయాలని, దోషులకు కఠినంగా శిక్షించాలంటూ కలెక్టర్, ఎస్పీలను కోరారు. న్యాయవాది వెంకటరాముడు, సీపీఐ నాయకులు రమేష్, సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, పక్కీరయ్య, గోపాల్, తదితరులు కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలు సమర్పించారు.




వాసంతి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్

నిజనిర్ధారణ అయితే కఠినంగా వ్యవహరిస్తాం

వాసంతి మృతదేహం లభ్యమైన ఈ కేసులో నిజనిర్ధారణ అయితేదోషులపై కఠినంగా వ్యవహరిస్తాం. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నారు. కేసు నిజానిజాలు త్వరలోనే బయటపడతాయి. తప్పు జరిగిందని నిర్ధారణ జరిగితే చట్టపరంగా చాలా కఠినంగా వ్యవహరిస్తాం. ఈ విషయం రాష్ట్రమంతా చూస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బాధిత వాసంతి కుటుంబానికి అన్ని విధాల మద్దతు ఉంటుంది.

- కలెక్టర్ రాజకుమారి, నంద్యాల

అన్ని కోణాల్లో విచారణ జరుగుతోంది

వాసంతి అదృశ్యం కేసులో అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేస్తున్నాం. త్వరలోనే నిజానిజాలు బయటకు వస్తాయి. ఎవరూ కూడా అధైర్యపడాల్సిన పని లేదు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో తనిఖీలు చేయిస్తున్నాం. ఇతర కోణాల్లో కూడా దర్యాప్తు చేస్తున్నాం.

- ఎస్పీ రఘువీర్‌రెడ్డి, నంద్యాల

పని చేయని సీసీ కెమెరాలు


నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అప్రోచ్ కాలువ వద్ద ఏం జరుగుతుందన్న విషయాలను పరిశీలించేందుకు గతంలో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే ఏ ఒక్క సీసీ కెమెరా పని చేయడం లేదు. ఎత్తిపోతల పథకానికి వెనుకభాగంలో ఉన్న సీసీ కెమెరా పని చేసి ఉంటే సంఘటనకు సంబంధించి మెరుగైన ఆధారాలు లభించేవి. అలాగే ఎత్తిపోతల పథకం ముందు భాగంలో ఉన్న సీసీ కెమెరా పనిచేసి ఉంటే అప్రోచ్ కాలువ మీదకు ఎవరెవరు వెళ్లారన్న వీడియోలు కూడా రికార్డు అయ్యేవి. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో కేసును చేదించేందుకు ఆలస్యమవుతోంది.


కాలువ గట్టుపై బారుతుల తీరిన జనం

గుజిరి దుకాణాల్లో నూలుమిల్లు యంత్రాలు

- పట్టపగలే ఆటోలో తరలింపు
- పోలీసుల అదుపులో ఒకరు


ఆటోనగర్‌లోని పాత సామాన్ల అంగడిలోకి తరలిస్తున్న జిన్నింగ్ యంత్రాలు

పాణ్యం, జూలై 11: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని నూలుమిల్లులోని యంత్రాలు గుజిరీ దుకాణాలకు చేరుతున్నాయి. ప్రభుత్వానికి చెందిన సంస్థలోని ఇనుప వస్తువులను ఇలా కొందరు నంద్యాల ఆటోనగర్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గురువారం పట్టపగలే ఆటోలలో ఎంతో విలువైన జిన్నింగ్ యంత్రాలను తరలించారు. మిల్లు వెనుక వైపు నుంచి ఆటోల్లో ఈ యంత్రాలను నంద్యాల ఆటోనగర్‌లోని ఒక పాత సామగ్రిని కొనుగోలు చేసే దుకాణానికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే మిల్లు వద్దకు వెళ్లి అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. టెక్స్‌టైల్స్ ఏడీ రామకృష్ణ మాట్లాడుతూ ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇదిలా ఉండగా 1988 జూలై 6 వతేదీన ప్రారంభమైన మిల్లు 1996 మే 6న మూతపడింది. కోట్లాది రూపాయల విలువైన యంత్రాలు ఈ మిల్లులో ఉన్నాయి. అప్పటి నుంచి రాష్ట్ర టెక్స్‌టైల్స్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో సెక్యూరిటీ ని ఏర్పాటు చేసి కోట్లాది రూపాయల విలువైన యంత్ర సామగ్రిని కాపాడుకుంటూ వచ్చారు. కాగా 2020లో సెక్యూరిటీని తొలగించడంతో మిల్లులో దొంగతనాలు పెరిగాయి. అనంతరం కొంత మందిని సెక్యూరిటీగా ఏర్పాటు చేసినా దొంగతనాలు ఆగలేదు. దొంగ సామాన్లు అమ్మే అడ్డాగా ఆటోనగర్ మారినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పాణ్యం, గడివేముల, బేతంచెర్ల ప్రాంతాలలోని రైతుల మోటార్లు దొంగతనానికి గురై రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సంఘటనతో ఆటోనగర్‌లో చోరీ చేరీ చేసిన సామాన్లను కొందరు అమ్ముతున్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దొంగ సామాన్యులను తరలించే ఆటోలకు ఎటువంటి నెంబరు ప్లేట్లుగానీ, పోలీసు నెంబర్లుగానీ ఉండకపోవడం గమనార్హం.

టూరిజం హబ్‌గా ఓర్వకల్లు రాక్ గార్డెన్

జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా బృందం పరిశీలన



కర్నూలు(అర్బన్), జూలై 11: జియాలాజికల్ టూరిజం హబ్‌గా ఓర్వకల్లు రాక్ గార్డెన్‌ను కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి చేయడానికి సర్వేలు నిర్వహించిందని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా బృందం రాష్ట్రంలో 7 చోట్ల జియాలాజికల్ హెరిటేజ్ సైట్ల సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారంఓర్వకల్లు రాక్ గార్డెన్‌ను ప్రత్యేక బృందం అధికారి హరిక్రిష్ణ ఆధ్వర్యంలో పరిశీలించింది. అనంతరం అక్కడ హై జీవో కల్చర్ డైవర్సిటీ , జియో టూరిజం అభివృద్ధి దిశగా హై రెవల్యూషన్, డ్రోన్‌ల ద్వారా వీడియోలను చిత్రీకరించారు. సర్వేల అనంతరం కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో జియాలాజికల్ సర్వే నివేదికల ఆధారంగా రాక్ గార్డెన్ పర్యాటకులకు అవసరమైన తీరులో సద్వినియోగం చేసుకునే దిశగా ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

నంద్యాల (నూనెపల్లె), జూలై 11: నంద్యాల మండలం అయ్యలూరి మెట్ట వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సీతారాంసింగ్ (53) అక్కడికక్కడే మృతి చెందారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన సీతారాంసింగ్ ఆటో నడుపుకుంటూ కుటంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం గాజులపల్లి నుంచి నంద్యాలకు బయలు దేరిన ఆటో నంద్యాల మండలంలోని అయ్యలూరి మెట్టకు చేరుకునే సరికి ఎదురుగా వచ్చిన ఓ వాహనం ఢీకొట్టింది. ఆటో డ్రైవర్ సీతారాంసింగ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

తక్కువ ధరకే కందిపప్పు

ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించిన జేసీ నారపురెడ్డి మౌర్య


ధరల పట్టిక


ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 11: సరసమైన ధరకు నాణ్యమైన కందిపప్పు, బియ్యాన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా గురువారం నుంచి విక్రయాలు ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు. సి.క్యాంపు సెంటర్‌లోని రైతుబజారులో సరుకుల ప్రత్యేక కౌంటరును జేసీ గురువారం ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశానుసారం జిల్లాలోని సి.క్యాంపు సెంటర్, వెంకట రమణకాలనీల్లోని రైతు బజార్లలో, ఆదోనిలోని మండి మార్కెట్, కర్నూలు అర్బన్ మోర్ మార్కెట్, కర్నూలు డి-మార్ట్, స్పెన్సర్, జ్యోతి మాల్, రిలయన్స్ మొత్తం 9 సెంటర్లలో విక్రయాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కౌంటర్ల ద్వారా కొనుగోలు చేసే వినియోగదారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకురావాలని తెలిపారు. వారికి కేజీ కంది పప్పు, ఐదు కేజీల బియ్యం ఇస్తారని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.181 ఉన్న కంది పప్పును రూ.160కు రూ.55.85 ఉన్న స్టీమ్డ్ బీపీటీ సోనామసూరి బియ్యాన్ని రూ.49కు రూ.52.40 ఉన్న పచ్చి బీపీటీ సోనామసూరి బియాన్ని రూ.48కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, డీఎస్‌వో కేవీఎస్‌ఎం ప్రసాద్, మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, కల్లూరు తహసీల్దార్ మునివేలు, ఏఎస్‌వో రామాంజనేయులు, ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

10 తులాల బంగారు, బైక్ స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కర్నూలు, జూలై 11: కర్నూలు నగరంలో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి పది తులాల బంగారు నగలతో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ మోహన్ కిశోర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పల్నాడు జిల్లాకు చెందిన కందుల సత్యనారాయణ ఓ దొంగతనం కేసులో మాచర్ల జైలులో ఉన్నారు. పల్నాడు ప్రాంతానికే చెందిన కుందుర్తి రవికుమార్ సొంతంగా లారీలు రవాణా వ్యాపారం చేస్తూ ఓ కేసులో జైలుకు వెళ్లాడు. అక్కడ నిందితులిద్దరికి స్నేహం కుదిరింది. సత్యనారాయణ దొంగతనాలు చేస్తే బయటి నుంచి బెయిల్ ఇప్పించేలా రవికుమార్‌తో ఒప్పందం కుర్చుకున్నారు. అనుకున్న ప్రకారం ఇద్దరూ బెయిల్‌పై బయటకు వచ్చారు. సత్యనారాయణ పల్నాడు నుంచి నేరుగా బైక్‌పై కర్నూలుకు వచ్చాడు. గత ఏప్రిల్ నెల 28న గోపీనగర్‌లో ఓ చోరీ చేసి వెళ్లిపోయాడు. తర్వాత జూన్ 20న బాబా బృందావన్ నగర్‌కు వచ్చి తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ చేసి తిరిగి వెళ్లిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ శంకరయ్య, ఎస్ఐ మోహన్ కిషోర్ రెడ్డి, క్రైం పార్టీ సిబ్బంది దర్యాప్తును వేగవంతం చేశారు. సీసీకెమెరాల ఆధారంగా ఓ వ్యక్తి నెంబరు ప్లేట్ లేని బైక్‌పై, హెల్మెట్ పెట్టుకుని వచ్చినట్లు గుర్తించారు. ఈ ఆధారాలతో బైక్ వెళ్లిన మార్గం వెంట ఈ పోలీసు బృందం గాలించింది. కేవలం నెంబరు ప్లేట్ లేకుండానే బైక్‌పై వెళ్లిన నిందితుడు వెళ్లిన మార్గంలోనే పరిశీలించుకుంటూ వెళ్లారు. అలా బళ్లారి చౌరస్తా సమీపంలో నిందితుడు హైదరాబాదు వెళ్లినట్లుగా గుర్తించారు. హైదరాబాదు వెళ్లిన మార్గంలో టోల్‌గేట్, సీసీ కెమెరాలను తనిఖీ చేసుకుంటూ వెళ్లి హైదరాబాదు నుంచి పల్నాడు వెళ్లినట్లుగా గుర్తించారు. చివరగా పల్నాడు వెళ్లి నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన బంగారాన్ని నిందితులు ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టినట్లు గుర్తించారు. నిందితుడికి సహకరించిన రవికుమార్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా కందుల సత్యనారాయణపై 36 దొంగతనాల కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

కర్నూలు రేంజ్ డీఐజీగా కోయ ప్రవీణ్ కుమార్



కర్నూలు, జూలై 11: కర్నూలు రేంజ్ డీఐజీగా కోయ ప్రవీణ్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న డీఐజీ విజయరావును డీజీపీ వద్ద రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. కోయ ప్రవీణ్ కుమార్ ప్రస్తుతం గ్రేహౌండ్స్ డీఐజీగా ఉన్నారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఈయన మొదట గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా పని చేశారు. ఆ తర్వాత ఖాజీపేట ఏఎస్పీగా, పార్వతిపూరం ఏఎస్పీగా పని చేశారు. విశాఖపట్నం ఎస్పీగా, విజయవాడ డీసీపీగా, కాకినాడ ఫోర్స్ ఎస్పీగా, ప్రకాశం జిల్లా ఎస్పీగా, గుంతకల్లు రైల్వే ఎస్పీగా, పోలీస్ ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్ ఎస్పీగా పని చేశారు. 16వ బెటాలియన్ ఏపీఎస్పీ కమాండెంట్‌గా విధులు నిర్వహించారు. 2022లో కౌంటర్ టెర్రరిస్టు ఆపరేషన్స్ ఆర్గనైజేషన్‌లో ఎస్పీగా పని చేశారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్నారు.

కౌలు రైతులను గుర్తించాలి

- 22,235 మందికి సీసీఆర్సీ కార్డులు జారే లక్ష్యం
- వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 11: ఈ సంవత్సరం పంటల సాగులో కౌలు రైతులు ఇబ్బంది పడకుండా వారికి సకాలంలో పంట రుణాలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా లబ్ది చేకూర్చేందు కోసం కౌలు రైతుల గుర్తింపు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు జేడీ వరలక్ష్మి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌లో 22,235 మంది కౌలు రైతులను గుర్తించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని పూర్తి చేసి వారికి సాగుదారు హక్కు పత్రం అందిస్తామని స్పష్టం చేశారు. కౌలు రైతుల గుర్తింపు కోసం వచ్చే వారం గ్రామ సభలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. కల్లూరులో 3,350 మంది, పత్తికొండలో 2,520, ఎమ్మిగనూరులో 2,790, పాణ్యం నియోజకవర్గంలో 3,350, ఆలూరు నియోజకవర్గంలో 3,465 మంది కౌలు రైతులను, ఎమ్మిగనూరులో 2,790, కోడుమూరు నియోజకవర్గంలో 4,050 మంది కౌలు రైతులను గుర్తించి వెంటనే వారికి సీసీఆర్సీ కార్డులు అందిస్తామని తెలిపారు.

వీఆర్వో అవినీతిపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కల్లూరు, జూలై 11: కల్లూరు మండలంలోని ఓ వీఆర్వోపై వచ్చిన అవినీతి ఆరోపణలపై కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి విచారణ చేపట్టారు. ఈనెల 10న ఆంధ్రజ్యోతిలో వచ్చిన అవినీతి ఘనాపాటి శీర్షికతో ప్రచురితమైన వార్తకు స్పందించిన రెవెన్యూ అధికారులు రెండు రోజులుగా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వీఆర్వోకు నోటీసులు జారీ చేసిన ఆయన వివరణ తీసుకున్నారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాల మేరకు ఈ విచారణ చేపట్టినట్లు ఆర్డీవో తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్లతో కలిసి వక్ఫ్‌బోర్డు, ఇరిగేషన్, ప్రభుత్వ భూములను మార్చుచేసి భూమిని అన్యాక్రాంతం చేశారో సర్వే నెంబర్ వారీగా పాత రికార్డులు, ప్రస్తుత రికార్డులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని కల్లూరు తహసీల్దారును ఆదేశించినట్లు ఆర్డీవో తెలిపారు. నివేదిక రాగానే క్షేత్రస్థాయిలో పరిశీలించి కలెక్టర్‌కు తుది నివేదికను అందజేస్తామని చెప్పారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన జిల్లా నాయకులు


మంత్రి లోకేశ్‌ను కలిసిన తిక్కారెడ్డి, ఎమ్మెల్యే శ్యాంబాబు

కర్నూలు(అర్బన్), జూలై 11: టీడీపీ నాయకులకు రక్షణ కల్పించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మంత్రి లోకేశ్‌ను కోరారు. మంగళగిరిలో గురువారం ఆయనను కలిసి జిల్లాలో పరిస్థితులపై వివరించారు. వైసీపీ మూకల చేతిలో కిరాతకంగా హత్యకు గురైన గిరినాథ్ చౌదరి కుటుంబాన్ని పరామర్శిస్తానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన గిరినాథ్ చౌదరిని వైసీపీ నాయకులు హత్య చేశారని, ఆయన బాబాయ్ సుబ్బారెడ్డికి ప్రాణ హాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దాడిలో గిరినాథ్ చౌదరి సోదరుడు కళ్యాణ్ గాయాలతో బయటపడగా సుబ్బా రెడ్డి త్రుటిలో తప్పించుకున్నారని వివరించారు. సుబ్బారెడ్డికి పార్టీ అండగా నిల వాల్సిన అవసరం ఉందని లోకేశ్‌కు వివరించారు. అలాగే మొన్నటికి మొన్న కప్పట్రాళ్లలో ప్రత్యర్థికి బెయిల్ వస్తే బాధితుడి ఇంటి ఎదుట బాణసంచా కాల్చా రని లోకేశ్‌కు తెలిపారు. గిరినాథ్ చౌదరి కుటుంబంతోపాటు సుబ్బారెడ్డికి ప్రత్యేక రక్షణ కల్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తానని మంత్రి నారా లోకేశ్ చెప్పా రని తిక్కారెడ్డి, ఎమ్మెల్యే శ్యాంబాబు తెలిపారు. కుటుంబానికి అన్ని రకాలుగా పా ర్టీ అండగా ఉంటుందని, అవసరమైన రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.

'దళారులను నమ్మి మోసపోవద్దు'

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 11: కొంత మంది దళారులు మత్స్యశాఖలో అమలు చేస్తున్న పథకాల్లో లబ్ధి చేకూరుస్తామని దళారులు ప్రజల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు తమకు సమాచారం అందిందని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని మత్స్య శాఖ ఏడీ శ్యామల సూచించారు. గురువారం కర్నూలు నగరంలోని మత్స్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హత ఉన్న వారికే పథకాల్లో లబ్ధి చేకూరుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనర్హులకు అవకాశం కల్పించబోమని స్పష్టం చేశారు. ప్రజలను మోసం చేస్తున్న దళారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 26న పత్తికొండ మండలం పందికోన రిజర్వాయరులో చేపల వేటకు సంబంధించి లీజు ఇవ్వడానికి బహిరంగ వేలం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తామని, వేలంలో పాల్గొనదలచిన వారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని యువకుడి ఆత్మహత్య

కౌతాళం, జూలై 11: భార్య కాపురానికి రావడం లేదని జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వల్లూరు గ్రామంలో జరిగింది. కౌతాళం పోలీసులు తెలిపిన వివరాలివీ.. వల్లూరు గ్రామానికి చెందిన వాసయ్య గారి ఈరన్న(25)కు కర్ణాటకకు చెందిన పార్వతితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి తరువాత ఈరన్న తాగుడుకు బానిసై నిత్యం గొడవ పడుతుండగా పార్వతి రెండేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయారు. బుధవారం అర్ధరాత్రి అందరూ పడుకున్న తరువాత ఇంటి ముందున్న వేప చెట్టుకు ఉరి వేసుకున్నారు. ఈరన్న తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం కోసం ఆదోని ఆసుపత్రికి తరలించారు.

కేవీఆర్ కళాశాల అభివృద్ధికి కృషి: ఎంపీ


కళాశాలను పరిశీలిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 11: కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని కర్నూలు పార్లమెంటు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశా లను ఆయన పరిశీలించారు. కళాశాల ప్రాంగణమంతా కలియతిరిగి సమస్య లను ప్రిన్సిపాల్ లాలెప్పను అడిగి తెలుసుకున్నారు. కళాశాలకు 44 తరగతి గదులు అవసరం ఉందని, అందుకు రూ.6 కోట్లు నిధులు అవసరం అవుతుందని, కళాశాలకు ప్రత్యేకంగా గేటును ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ ఆయన్ను కోరారు. డిగ్రీ కళాశాలకు సంబంధించిన నాలుగు గదులు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇక్కడ చదివే విద్యార్థులంతా పేద కుటుంబాలకు వచ్చిన వారేనని, హాస్టల్ వసతులు కల్పించాలని ఎంపీకి ప్రిన్సిపాల్ వివరించారు. అందుకు ఎంపీ నాగరాజు స్పందిస్తూ కళాశాల కు ప్రత్యేకమైన గేటును ఏర్పా టు చేసేందుకు అవసరమైన నిధులు సమకూరుస్తానన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణాల నిధుల కోసం కార్పొరేట్ విద్యాసంస్థలతో మాట్లాడి ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ వెంట ప్రిన్సిపాల్ లాలెప్ప, అధ్యాపకులు రఘుచరణ్, శివయ్య, టీడీపీ నాయకులు ఉన్నారు.

కమిషనర్‌తో ఎంపీ భేటి

కర్నూలు(న్యూసిటీ): కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవతేజ గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీకి కమిషనర్ పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. నగరాభివృద్ధికి పూర్తి సహకరం అందిస్తానని ఎంపీ పేర్కొన్నారు. అనంతరం నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పలు సమస్యలపై ఎంపీ కమిషనర్‌తో చర్చించారు.

ఎంపీని కలిసిన టీఎన్‌టీయూసీ ఉద్యోగులు

కర్నూలు(అర్బన్): కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును టీఎన్‌టీయూసీ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం నగరంలోని ఆయన నివాసంలో తెలుగు నాడు మెడికల్ హెల్త్ ఎంప్లా యీస్ యూనియన్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలను వివరిం చారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు, జిల్లా నాయకులు చంద్రశేఖర్, మద్దిలేటి, మాధవరాజు, గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్ అసో సియేషన్ అధ్యక్షుడు వై.నరసింహులు, రామానాయుడు పాల్గొన్నారు.

యువత క్రమశిక్షణ అలవర్చుకోవాలి

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 11: యువత క్రమశిక్షణ అలవర్చుకోవాలని సెట్కూరు సీఈవో పీవీ రమణ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భం గా యువతకు యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో కేవీఆర్ మహిళా కళాశాల సెమినార్ జరిగింది. సీఈవో మాట్లాడారు.

విద్యుత్‌శాఖ అధికారులపై ఎమ్మెల్యే గౌరు చరిత ఆగ్రహం

కల్లూరు, జూలై 11: విద్యుత్‌శాఖ అధికారులపై పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన చేపట్టిన కల్లూరు మండల సర్వసభ్య సమావేశానికి గౌరు చరిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత నాలుగు సమావేశాలకు విద్యుత్‌శాఖ ఏఈగాని, పై అధికారులు రాకపోవడం, గ్రామాల్లో పేరుకుపోయిన సమస్య లపై ఎంపీటీసీలు, సర్పంచులు ఎమ్మెల్యేకు ఏకరువు పెట్టడంతో గౌరుచరిత అధికారులకు ఫోన్‌చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. లైన్‌మన్‌ను సమావేశానికి పంపడం పట్ల ఆమె అసహనం వ్యక్తం చేశారు. అదేవిధంగా మండలంలో యాపర్లపాడు రోడ్డు ఎప్పటికి పూర్తి చేస్తారని పంచాయతీరాజ్ ఏఈని అడగ్గా.. పీఏయూ అధికారులు చూస్తారని సమాధానమిచ్చారు. కాంట్రాక్టరుతో మాట్లాడి రోడ్డు పూర్తిచేయాలని ఆశాఖ అధికారులను ఒకసారి కలవాలని చెప్పారు. ముఖ్యంగా సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గౌరుచరిత మండల అధికారులను ఆదేశించారు. డయేరియా ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో నీరునిల్వ లేకుండా చేడాలని, క్రమం తప్పకుండా నీటిని క్లోరినేషన్ చేయాలని, కాల్వల్లో పూడికతీసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.

పాణ్యం ఎమ్మెల్యేకు సన్మానం

కల్లూరు మండల సర్వసభ్య సమావేశానికి మొట్టమొదటి సారిగా విచ్చేసిన గౌరుచరితమ్మను ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికా రులు పూలబోకేలు అందించి శాలువాలతో సత్కరించారు. అంతకు ముందు మండల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. పెద్దపాడు, పర్ల గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిలను నిర్మించాలని, ఎంపీటీసీలకు వేతనం అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాలని, డ్రైనేజీలు, రోడ్ల నిర్మించాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అధికారు లతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గౌరుచరిత స్పష్టం చేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

'హామీల అమలుకు సీఎం కృషి'

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని గౌరు చరిత హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే పెంచిన పింఛన్లు పంపిణీ చేశామని ఉచిత ఇసుకను ప్రజలకు అందు బాటులోకి తెచ్చి సొంతింటికల సాకారం చేయనున్నారని, కార్మిక రంగానికి చేతినిండా పని దొరుకుతుందని అన్నారు. కల్లూరు మండల అభివృద్ధికి ఎంపీ టీసీలు, సర్పంచులు, అధికారులు సహకరించాలని సూచించారు. ఎంపీపీ బి.శారద, తహసీల్దారు మునివేలు, ఈవోఆర్డీ రవికిషోర్, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డికి మాతృవియోగం

కర్నూలు(రూరల్), జూలై 11: టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి ఈ.రత్నమ్మ(91) గురువారం కన్నుమూశారు. కొంత కాలంగా శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండటంతో ఆమె పెద్ద కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి చికిత్స నిమిత్తం నగరంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. నానాటికి పరిస్థితి విషమించ డంతో వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచి వైద్య చికిత్సలు అందించినా ఫలితం దక్కలేదు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం 8గంటలకు రత్నమ్మ తుదిశ్వాస విడిచారు. తల్లి మరణ వార్త వినగానే విష్ణు ఆసుపత్రికి వెళ్ళి తన తల్లి రత్నమ్మ భౌతికాయాన్ని చూసి కన్నీటి పర్యవంతమయ్యారు. అనంతరం తల్లి భౌతికాయాన్ని విష్ణువర్ధన్‌రెడ్డి కర్నూలులోని నెహ్రూనగర్‌లో ఉన్న తన స్వగృహానికి తీసుకొచ్చారు. విష్ణు కుటుంబ సభ్యులు, బంధువులు ఇంటికి చేరుకుని తల్లి భౌతికాయానికి నివాళి అర్పించారు. రత్నమ్మకు మొత్తం ఏడుగురు సంతానం కాగా వారిలో ముగ్గురు కూతుర్లు, నలుగురు కుమా రులు ఉన్నారు. వారిలో అందరికంటే పెద్ద కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి. నాలు గు నెలల క్రితం విష్ణు రెండవ తమ్ముడు గోవర్దన్‌రెడ్డి అనారోగ్యంతో చనిపో వడం, మూడేళ్ల క్రితం విష్ణువర్ధన్‌రెడ్డి కుమారుడు రాజవర్ధన్‌రెడ్డి మరణిం చడం ఇప్పుడు ఆయన తల్లి రత్నమ్మ మృతి చెందడం వరుస సంఘటనలతో ఆకుటుంబాన్ని మరింత శోకసంద్రంలోకి నెట్టింది. పాతబస్టాండ్‌లోని జమ్మి చెట్టు వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికిలో సాయంత్రం 4గంటలకు అంత్యక్రియలు నిర్వహించారు.


నివాళి అర్పిస్తున్న టీజీ వెంకటేశ్, ఇన్‌సెట్‌లో రత్నమ్మ(ఫైల్)

ప్రముఖుల నివాళి: విష్ణువర్ధన్‌రెడ్డి తల్లి రత్నమ్మ మృతికి పలువురు రాజకీయ ప్రముఖులు నివాళి అర్పించారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, జయ నాగేశ్వరరెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, గౌరు వెంకటరెడ్డి, ఐద్వా నాయకురాలు నిర్మలమ్మ, తుగ్గలి నాగేంద్ర దంపతులు, టీడీపీ రాష్ట్ర నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డీవీఆర్ వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

ఉన్నత విద్యామండలిలోని పదవులు రద్దు చేయాలి

కర్నూలు(అర్బన్), జూలై 11: రాష్ట్ర ఉన్నత విద్యామండలిలో వైసీపీ కండువా నీడలో పనిచేసిన అధికారులు, నామినేటెడ్ పదవులు, పాలక మండలి సభ్యులను తక్షణమే తొలగించాలని నిరుద్యోగల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీరాములు డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడా రు. ఇన్‌చార్జి ఛైర్మన్ కె.రామ్మోహన్‌రావు, వైస్ ఛైర్మన్ వై.నజీర్ అహ్మద్, అసిస్టెంట్ స్పెషల్ ఆఫీసర్ జి.మాధవిని తక్షణమే తొలగించాలని కోరారు. ఏపీఎస్‌సీహెచ్ఈ మాజీ ఛైర్మన్ హేమచంద్రారెడ్డి అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని కోరుతూ ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశిం చిన గవర్నర్‌కు నిరుద్యోగుల ఫోరం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఫోరం నాయకులు బి.నాగరాజు, చంద్రశేఖర్, సురేష్, పాల్గొన్నారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు(రూరల్), జూలై 11: కర్నూలు కొత్తబస్టాండ్ ఆవరణంలో ఏపీపీటీడి ఎంప్లాయీస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఆ యూనియన్ నాయకులు, కార్మిక ఉద్యోగులు ఘనంగా జరుపు కున్నారు. కర్నూలు-1డిపో ఎదుట ఎంప్లాయీస్ యూనియన్ జెండాను రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి ఆవిష్కరించారు. డిపో అధ్యక్షుడు చంద్ర, డిపో కార్యదర్శి ఆర్‌వీఎం రావు, కర్నూలు-2డిపో అధ్యక్షుడు జీవీ రెడ్డి, కార్యదర్శి మహేశ్వ రరావు, రీజనల్ జాయింట్ సెక్రటరి క్రిష్ణార్జునరెడ్డి, డిపో జాయింట్ సెక్రటరి క్రిష్ణ, చంటి, వెంకటేశ్వర్లు, శ్రీను, వీరేష్, బలరాంనాయక్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించండి

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 11: ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా అనేక రోగాలకు పశువులు గురయ్యే ప్రమాదం ఉందని, అందువల్ల వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డా.రవిబాబు తెలిపారు. గొర్రెలు, మేకల్లో నీలి నాలుక, చిటుకు వ్యాధి వ్యాపించే అవకాశం ఉందని, అదే విదంగా తెల్లజాతి పశువుల్లో ముద్ద చర్మపు వ్యాధి సోకనుందని, ఈ వ్యాధుల నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీకాలు వేసే కార్యక్ర మాన్ని చేపడుతున్నాయని గురువారం విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. కర్నూలు జిల్లాలో 13,15,250 డోసులు, నంద్యాల జిల్లాలో 8.71 లక్షల డోసుల వ్యాక్సిన్ వచ్చిందన్నారు. నెల రోజుల పాటు టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపడుతామని తెలిపారు.

'పార్టీ బలోపేతానికి కృషి'

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 11: పార్టీ సిద్ధాంతాలు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకవెళ్లి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేద్దామని పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా సమన్వయకర్త చింతా సురేష్‌బాబు తెలిపారు. గురువారం బిర్లా కాంపౌం డ్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో బోయ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరోరా నగర్ యువత చింతా సురేష్‌బాబు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకు న్నారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువా కప్పి సాదరంగా ఆహ్వానిం చారు. వెంకటరమణ, శేఖర్, దస్తగిరి, మౌలాలి, మురళి పాల్గొన్నారు.

'పశువైద్యంపై నిర్లక్ష్యం వద్దు'

సి.బెళగల్, జూలై 11: పశువైద్యంపై నిర్లక్ష్యం వద్దని పశుసంవర్థకశాఖ ఏడీ శివకుమార్ సూచించారు. మండలంలోని పోలకల్లు గ్రామములో స్థానిక పశువైద్యాధికారి రోనాల్డు రిచర్డ్స్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడీ మాట్లాడారు. అనంతరం ప్రభుత్వం నుంచి ఉచితంగా వచ్చిన గడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు.

బాలుడికి ఇరిగేషన్ సీఈ పరామర్శ

కర్నూలు(కల్చరల్), జూలై 11: ఆదోని మండలం ఇస్వీ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ బాలుడు హుస్సేన్ విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడి కర్నూలు సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. గురువారం ఈ విషయం తెలుసుకున్న జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ ఎస్ కబీర్‌బాషా ఆసుపత్రికి వెళ్లి బాలుడిని పరామర్శించారు. బాలుడి తల్లిదండ్రు లకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా తిరుపతికి చెందిన లావణ్యలక్ష్మి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం ఆసుపత్రిలోని బాలుడిని ఆమె పరామర్శించారు.

హుస్సేన్‌కు సూపరింటెండెంట్ పరామర్శ

కర్నూలు(హాస్పిటల్): ఆదోని మండలం ఇస్వీ గ్రామానికి చెందిన ఈరమ్మ, బసవరాజు దంపతుల కుమారుడు హుసేన్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద విద్యుత్ తీగతో తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన బాలున్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి గురువారం కాలిన రోగుల వార్డులో పరామర్శించారు. గాయపడ్డ


బాలుడిని పరామర్శిస్తున్న సీఈ కబీర్‌బాషా

బాలుడు ఎడమ చేయితోపాటు శరీరంలో కొంత భాగం కాలిపోయిందని సూపరింటెండెంట్ తెలి పారు. కాలిపోయిన భాగాన్ని పరిశీలించి చిన్నారి పరిస్థితులపై ఆరా తీశారు. 20 శాతం కాలిన గాయాల వల్ల బాలుడికి ప్రాణపాయస్థితి లేదని తెలి పారు. అనంతరం మెరుగైన వైద్యసేవలు అందిం చాలని, మంచి ప్రొటీన్ ఆహారం, కావాల్సిన మందులు అవసరమైతే లోకల్ పర్చేజ్ చేయాలని ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ మంజులబాయిని ఆదేశిం చారు.

'కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించండి'

కర్నూలు(హాస్పిటల్), జూలై 11: జనాభా అదుపునకు కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని కలెక్టర్ పి.రంజిత్ భాషా సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన లబ్ధిదారులు బహుమతుల కోసం లక్కీడిప్ ద్వారా ఎంపిక చేయడం జరిగింది. ఇందులో కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతి పీపీఐయుసీడీ విభాగంలో కడపకు చెందిన రంగమ్మ, అంతర ఇంజెక్షన్ విభాగంలో మంత్రాలయానికి చెందిన జానకీ ప్రియ, వ్యాసెక్టమీ విభాగంలో కర్నూలు గిప్సన్ కాలనీకి చెంది న మురళీధర్ రెడ్డిలను లక్కీడిప్ ద్వారా ఒక్కొక్కరికి రూ.5వేలు ప్రోత్సాహకా లను ప్రకటించారు.

బెస్ట్ డాక్టర్లుగా మైత్రి, మాధవీలత: కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు (పీపీఐయూసీడీ) చేసిన ఇద్దరు వైద్యులను బెస్ట్ డాక్టర్లుగా డీఎంహెచ్‌వో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రకటించారు. పీపీఐయూసీడీలో ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రికి చెందిన డా.కె.మైత్రి 172 ఆపరేషన్లు చేసి బెస్ట్ డాక్టరుగా నిలిచి రూ.8వేలు ప్రోత్సహకాన్ని అందుకోనున్నారు. ఆదోని ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డా.మాధవీలత 101 ఆపరేషన్లతో రూ.5వేలు ప్రోత్సాహాన్ని అందుకోనుంది. బెస్టు ఆశా కార్యకర్తలుగా దైవందిన్నె పీహెచ్‌సీ కడిమెట్లకు చెందిన కె.రంగలక్ష్మి, ఇదే పీహెచ్‌సీకి చెందిన కె.తిమ్మాపురానిక చెందిన మహాలక్ష్మి, ఉత్తమ ఆశా కార్యకర్తలుగా ఎంపికయ్యారు. ఈ ఇద్దరిని ఒక్కొక్కరికి రూ.2,500లు ప్రోత్సాహంను ప్రకటించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీఎంహెచ్‌వో

ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని మానుకోవాలి: కలెక్టర్

కర్నూలు(కల్చరల్): ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని ప్రతి ఒక్కరూ మానుకోవాలని, ప్లాస్టిక్ సంచులు, ఇతరత్రా ఉత్పత్తులతో పర్యావరణానికి జరిగే నష్టాన్ని గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఫోర్టు ఆధ్వర్యంలో, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజంతోనే భవిష్యత్తు శ్రేయస్కరంగా ఉంటుందని అన్నారు. లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ దామెర ప్రభాకర్, క్లబ్ ఇతర ప్రతినిధులు ఎన్ వెంకటరామరాజు, రత్నప్రసాద్, బీవీ రమణగౌడ్, రాజ్‌కు మార్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఓర్వకల్లు: నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాసంతి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆర్‌వీఎఫ్, ప్రగతిశీల విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం ఓర్వకల్లులో బస్టాం డులో కొవ్వొతులతో విద్యార్థులు, సంఘాల నాయకులు ధర్నా చేశారు. కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షులు అనీషాపాషా, ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్, ఎన్ఎఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగ సురేంద్ర, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్న, సురేష్ పాల్గొన్నారు.

కర్నూలు(కలెక్టరేట్): వాసంతిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వాల్మీకి యువ సేన రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం నగరం లోని వాల్మీకి యువసేన కార్యాలయంలో ఏర్పాటే చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు.

కర్నూలు(అర్బన్): వాసంతిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీసీ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంత య్య అన్నారు. గురువారం నగరంలోని బీసీ భవన్‌లో బీసీ జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందినవాసంతిని, అదే గ్రామా నికి చెందిన కొంత మంది యువకులు


ఓర్వకల్లులో ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు

హత్య చేయడం ఘోరమన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు దేవ పూజ ధనుంజయ్ ఆచారీ, శ్రీనివాసులు నాయుడు, అయ్యన్న యాదవ్, శ్రీరాము లు యాదవ్, కటిక కృష్ణోజీ రావు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యాన్ని నిగ్గు తేల్చండి

కర్నూలు(లీగల్): వాసంతి అదృశ్యంపై అధికా రులు, పోలీసులు నిగ్గు తేల్చాలని రాష్ట్ర వాల్మీకి న్యాయవాదుల అసోసియేషన్ కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నాగభూషణం నాయుడు డిమాండ్ చేశారు. వాసంతి బ్రతికి ఉందా లేదా అనేది తెలపకుంటే రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఉన్న వాల్మీకి సంఘాలన్నీ కలుపుకుని ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో న్యాయవాదులు గోపాలకృష్ణ, ప్రభాకర్, ఆనంద్, పద్మజనాయుడు, వీరేష్, బాలలక్ష్మయ్య, చంద్ర ప్రభాకర్ పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

కోడుమూరు(రూరల్), జూలై 11: కోడుమూరు సెబ్ స్టేషన్ పోలీసుల దాడిలో బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సంద ర్భంగా సెబ్ సీఐ రామాంజ నేయులు మాట్లాడుతూ ఎల్ బండ తాండలో రెండు చోట్ల నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 1275 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశామని తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. దాడుల్లో సిబ్బంది హనుమంతు, వీరుపాక్షిరెడ్డి, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

దొంగ బిల్లుల వసూళ్లపై విచారణ

సి.బెళగల్, జూలై 11: మండలంలోని కంబందహల్ గ్రామంలో దొంగ బిల్లుల వసూళ్లపై పిండిమిషన్ యజమానులు కేశన్న, పక్కీరప్ప ఫిర్యాదు మేరకు విద్యుత్ అధికారులు గురువారం విచారించారు. బుధవారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో 'దొంగ బిల్లులు వసూలు చేసిన విద్యుత్ సిబ్బంది' వెలువడిన కథనంపై విద్యుత్ అధికారులు స్పందించారు. ఈసందర్భంగా విద్యుత్ ఏడీ మాట్లాడుతూ సిబెళగల్ మండలంలోని కంబందహల్ గ్రామములో ఇద్దరు విద్యుత్ లైన్‌మెన్‌లు దొంగబిల్లుల వసూలకు పాల్పడితే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. ఏఈ సుకుమార్, గ్రామ పెద్దలు ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 11: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వెం కటలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. గత సం వత్సరం డిసెంబరు నుంచి సంపూర్ణ పోషణ బిల్లులు రాకపోవ డంతో అంగన్‌వాడీలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అంగన్ వాడీ కేంద్రాల అద్దెలు, కరెంటు బిల్లులు చెల్లిం చకపోతున్నారన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రవేశాలు

కర్నూలు(కల్చరల్), జూలై 11: కేంద్ర ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ క్యూలినరీ ఇనిస్టిట్యూట్ (ఐసీఐ)లో విద్యార్థులకు కుకింగ్ (పాకశాస్త్రం)లో మూడేళ్ల బీబీఏ (కలినరీ ఆర్ట్స్), రెండేళ్ల ఎంబీఏ (కలినరీ ఆర్ట్స్), మూడేళ్ల బీఎస్సీ (హాస్పిటాలిటీ అండ్ హోటల్ మేనేజ్‌మెంట్)లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తిరుపతి ఐసీఐ హెడ్ డాక్టర్ ఎం.త్రిలోక్‌చందర్ తెలిపారు. నగరంలోని హోటల్ త్రిగుణ క్లార్క్ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన హోటల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధుల మధ్య ఇనిస్టిట్యూషన్ అందిస్తున్న ఆయా కోర్సులు, ప్రవేశాల వివరాలు తెలిపే బ్రోచర్లు విడుదల చేశారు. వివరాలకు హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఐసీఐ తిరుపతి డాట్ ఇన్‌లో లేదా డాక్టర్ లోమ్టే దౌలత్‌రావు, సెల్ నెం. 81081 03478లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

జనాభా నియంత్రణకు అందరి సహకారం అవసరం

కర్నూలు(హాస్పిటల్), జూలై 11: జనాభా నియంత్రణకు అందరి సహకారం అవసరమని డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాల యం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో ప్రారంభిం చారు. కార్యక్రమంలో డీపీఎంవో (ఎన్‌హెచ్ఎం) డా.ఉమా, డీపీఎంవో డా.సం ధ్య, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డా.మల్లి కార్జున రెడ్డి, డెమో శ్రీనివాసులు, ఎస్‌వో హేమసుందరం, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడడ్డి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి

ఓర్వకల్లు, జూలై 11: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీవో మల్లేశ్వరి అన్నారు. గురువారం ఓర్వకల్లులో అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి ప్లాంట్ ఫర్ మదర్ అంటే తల్లి కోసం ఒక మొక్క అనే కార్యక్రమాన్ని త్వరలో అమ లు చేయబోతున్నామన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న నగర పంచాయతీ చైర్మన్, కమిషనర్

గూడూరు, జూలై 11: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని నగర కమిషనర్ దివాకర్ రెడ్డి అన్నారు. గురువారం గూడూరులో డయేరియా వ్యాధిపై తీసుకోవాలసిన జాగ్రత్తపై ర్యాలీని నగర పంచాయతీ చైర్మన్ జె వెంకటేశ్వర్లు, కమిషనర్ దివాకర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాచి వడ పోసిన నీటిని మాత్రమే తాగాలని, భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుకోవాలని, ఇంటి దగ్గర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో ఏఈ నరసింహులు, శానిటేషన్ అధికారి రవి, హెచ్‌ఈ కృష్ణారెడ్డి, హెచ్ఎస్ రాఘవయ్య, ఆరోగ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలి

మంత్రి లోకేశ్‌కు టీఎన్ఎస్ఎఫ్ నాయకుడి వినతి


మంత్రిని కలిసిన టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు బజారన్న

కర్నూలు(అర్బన్), జూలై 11: విద్యార్థుల సమస్యలపై మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించాలని టీఎన్ఎస్ ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి పోగు బజారన్న కోరారు. గురువారం మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్‌ను నంద్యాల పార్లమెంట్ అధికార ప్రతినిధి జలీల్ బాషాతో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల, ప్రజాసమస్యలపై వెంటనే దృష్టి సారించాలని, ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేటు విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. పాణ్యం నియో జకవర్గంలో, ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

నేటి నుంచి లేపాక్షి ఎంపోరియంలో 'థీమాటిక్ ఎగ్జిబిషన్'

కర్నూలు(కల్చరల్), జూలై 11: రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ మేనే జింగ్ డైరెక్టర్ ఎం. బాలసుబ్రహ్మణ్య రెడ్డి ఆదేశాల మేరకు కర్నూలులో పెద్ద పోస్టాఫీసు ఎదురుగా గల లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియంలో 'థీమాటిక్ ఎగ్జిబిషన్'ను శుక్రవారం నుంచి ఈనెల 16 వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపోరి యం మేనేజర్ బి.తిమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తాము ఉత్పత్తి చేసిన వస్తు ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునేలా ఏర్పాటు చేశామని, ఈ ప్రదర్శనల్లో కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, దుర్గిస్టోన్ కార్వింగ్స్, పొన్నిపెంట బ్రాస్ ఐటమ్స్, టెర్రాకోట పాట్‌లు తదితర హస్తకళా ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. లేపాక్షి ఎంపోరియంలో లభించే వివిధ రకాల వస్తు, వస్త్ర ఉత్పత్తుల్లో ఎంపిక చేసిన వాటిపై పది శాతం ప్రత్యేక తగ్గింపు ధరలు ఉంటాయని మేనేజర్ బి.తిమ్మయ్య తెలిపారు.

శివమ్మ మృతి టీడీపీకి తీరని లోటు

ఓర్వకల్లు, జూలై 11: మండలంలోని శకునాల గ్రామ మాజీ సర్పంచ్ శివమ్మ మృతి టీడీపీకి తీరని లోటని పార్టీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. గురువారం శకునాల గ్రామానికి వెళ్లి శివమ్మ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, నాయకులు మురళీధర్ రెడ్డి, హరి, పుల్లయ్య, సుబ్బ య్య పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక

సి.బెళగల్, జూలై 11: సి.బెళగల్‌కు చెందిన కుర్వతిమ్మప్ప కుమారుడు కె, వంశి అనే విద్యార్థి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థిని జడ్పీ ఉన్నతపాఠశాల ప్రదానోపాధ్యాయుడు, అబ్దుల్‌అజీజ్, ఉపా ధ్యాయులు అభినందించారు. హెచ్ఎం అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ సిబెళగల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువున్న విద్యార్థి ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



ఎంప్లాయిస్ యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకుడు బ్రహ్మయ్య

ఆదోని (అగ్రికల్చర్), జూలై 11: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం కార్మికులు, ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. స్థానిక డిపో ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు బ్రహ్మయ్య జెండాను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు రంగస్వామి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భవించిందన్నారు. పోరాటాల ఫలితంగా కార్మికులకు వైద్య సౌకర్యం, పని గంటల విధానాన్ని, వారాంతపు సెలవు వంటి అనేక సంక్షేమ పథకాలను సాధించుకున్నామని గుర్తు చేశారు. డిపో అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మన్న హులియప్ప, సుధాకర్, మెసేయ్యారాజు, గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ చాలా అవసరం

ఆదోని (అగ్రికల్చర్), జూలై 11: దేశంలో జనాభా నియంత్రణ చాలా అవసరమని, జనాభా పెరగడం వలన చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీప్రసన్న అన్నారు. గురువారం ప్రభుత్వ మాతశిశు ఆసుపత్రి నుంచి ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి ఆదేశాల మేరకు పురవీధుల్లో ర్యాలీ నిర్వహచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభా పెరుగుట వలన నిరుద్యోగ సమస్య, భూ సమస్యలు, ఆహార సమస్య, నీటి సమస్య, ధరల సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. మనం ఇద్దరూ మనకి ఇద్దరూ సంతానం ఉంటే సంసారం కూడా చాలా చక్కగా ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ మానస, డాక్టర్ అనిల్, డాక్టర్ గాయత్రి, సూపర్వైజర్ సీతారాముడు, పీపీ యూనిట్స్ సూపర్వైజర్ ఇందిరా దోరతి, అరుణ, జ్ఞానేశ్వరి, మల్లికార్జున, నాగరాజు, సౌజన్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

హొళగంద, జూలై 11: చిన్నహ్యాట గ్రామ సచివాలయానికి చెందిన పంచాయతీ కార్యదర్శి బీ రాజకుమార్‌తో పాటు మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో ఆజాద్ గురువారం తెలిపారు. సచివాలయానికి గైర్హాజరు కావడంతో పాటు, విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చిన్నహ్యాట గ్రామస్తుల నుంచి ఫిర్యాదు రావడంతో షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సచివాలయాలకు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత : డీఎస్పీ

ఎమ్మిగనూరు, జూలై 11: కాలుష్యం పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మిగనూరు ఇన్చార్జ్ డీఎస్పీ శివనారాయణ స్వామి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావణ, ప్రపంచ జనాభా దినోత్సవాలను స్థానిక భాష్యం పాఠశాలలో నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఇన్‌చార్జ్ డీఎస్పీ శివనారాయణ స్వామి విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అలాగే తహసీల్దార్, ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తాము నివాసం ఉంటున్న పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్, పట్టణ సీఐలు మోహన్ రెడ్డి, మధుసూధనరావు, రామకృష్ణ, ఎర్రిసావలి, ఎస్ఐ రమేష్ బాబు, డాక్టర్ మైత్రేయి, డీటీ శ్రీదేవి, ఆర్ఐ లక్ష్మన్న, పాఠశాల హెచ్ఎం మాచాని కవిత పాల్గొన్నారు.

రైతులు అపరాలను సాగుచేయాలి

వెల్దుర్తి, జూలై 11 : మండలంలో రైతు సోదరులు అపరాల వైపు మొగ్గుచూపాలని క్రిషి విజ్ఞాన కేంద్రం బనవాసి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ అశోక్ కుమార్ అన్నారు. గురువారం గోవర్ధనగిరి గ్రామంలో రైతు సేవా కేంద్రంలో రైతులు అపరాల సాగులో చేపట్టాల్సిన సాగు పద్ధతులు, మెళకువల గురించి తెలియజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్, జూలై 11 : ఇస్వీ, పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఐదుగురిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఆస్పరి మండలం కారుమంచి గ్రామానికి చెందిన బోయ భీమలింగ, చెన్నప్ప ఆటోలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా గురువారం సంతేకుడ్లూరు సమీపంలో అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి ఆరు మద్యం బాక్సులను, కోసిగికి చెందిన లక్ష్మన్న, గోపాలు ద్విచక్ర వాహనంలో మద్యం తరలిస్తుండగా, కోసిగి క్రాస్ వద్ద వారి నుంచి ఆరు మద్యం బాక్సులు, పెద్ద తుంబళంకు చెందిన గోవిందు వద్ద రెండు మద్యం బాక్సులు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ట్రైనీ డీఎస్పీ ధీరజ్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో బియ్యం లేవు

మద్దికెర, జూలై 11: మద్దికెర అంగన్‌వాడీ కేంద్రాలకు 10వ తేదీ దాటినా ఇంత వరకు బియ్యం సరఫరా కాలేదు. దీంతో నిర్వాహకులు బియ్యాన్ని అరువు తెచ్చుకొని వంటలు చేసి పిల్లలకు వడ్డిస్తున్నారు. మద్దికెరలో మొత్తం 19 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం, కందిబేడలు, మంచునూనె సరఫరా చేస్తుంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు దాదాపు వేయి మంది దాకా ఉన్నారు. ప్రతి నెలా అంగన్‌వాడీ నిర్వాహకులు చౌకదుకాణానికి వెళ్లి బియ్యం తెచ్చుకునే వారు. అయితే, నిబంధనలు మార్చి వాహనాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా చేస్తున్నారు. దీని ప్రకారం 2వ తేదీలోపు బియ్యం రావాల్సి ఉండగా.. ఇంత వరకు సరఫరా చేయలేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసే నిర్వాహకులు మధ్యాహ్న భోజనం వడ్డించడానికి అరువు తెచ్చి వంట చేస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేస్తున్న చిన్నారుల ఫైల్

బియ్యం సరఫరా చేయకపోతే పిల్లలకు ఇలా అరువుతెచ్చి ఎన్నిరోజులు వండిపెట్టేది అంటూ ప్రశ్నిస్తున్నారు. సమస్యపై ఈ నెల 8వ తేదీన రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు బియ్యం రాలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బియ్యం సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ రజాక్‌వలి మాట్లాడుతూ మద్దికెర అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా ఆలస్యమైన మాట వాస్తవమేనని, ఇబ్బంది కలగకుండా వెంటనే బియ్యం అన్ని కేంద్రాలకు అందేలా చూస్తామని వివరణ ఇచ్చారు.

నకిలీలు అరికట్టడంలో విఫలం

● ఓ అధికారి వ్యాపారులతో కుమ్మక్కయ్యాడు
● బాధ్యతగా పనిచేయండి..

లేదంటే సెలవుపై వెళ్లండి : ఎమ్మెల్యే బీవీ ఆగ్రహం

ఎమ్మిగనూరు, జూలై 11: నకిలీ విత్తనాలు, ఎరువులు,పురుగుమందులు అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి వ్యసాయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల కాలంతో ఎమ్మిగనూరులో నకిలీ విత్తనాలు, పురుగుమందులు అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని దీంతో రైతులు ఎంతో నష్టపోయారని అన్నారు. ఓ అధికారి వ్యాపారులతో కుమ్మక్కైనట్లు తనదృష్టికి వచ్చిందన్నారు. అధికారులు తీరును మార్చుకొని బాధ్యతగా పనిచేయాలనుకుంటే ఉండండి, లేదంటే సెలవుపై వెళ్లిపోవాలని అన్నారు. అలాగే మార్కెట్ యార్డులో గతంలో పనిచేసిన అధికారులు అక్రమంగా బిల్లులు చేసుకొని ప్రభుత్వ సొమ్మును స్వాహాచేశారని, వారిపై కూడా విచారిస్తామని పేర్కొన్నారు. ఖరీఫ్‌లో రైతులకు సాగనీటికి ఇబ్బంది రాకుండా జీడీపీ, ఎల్లెల్సీ నుంచి నీటిసరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. హార్టీకల్చర్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏడీఏ ఖాద్రీ, వ్యవసాయ అధికారులు మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎట్టకేలకు దుకాణాల తొలగింపు

● జేసీ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం
● డీసీఎంఎస్ స్థలాల్లో బంక్‌లు వేస్తే చర్యలు
● జిల్లా మేనేజర్ రాజేష్ కుమార్



బంక్‌లను తొలగిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

ఆలూరు, జూలై 11: ఆలూరు పట్టణంలోని కేడీసీఎంఎస్ గోదాం స్థలాలను ఆక్రమించి వేసుకున్న బంకులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో కేడీసీఎంఎస్ రెవెన్యూ, పోలీసు అధికారులు ఎట్టకేలకు గురువారం తొలగించారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినా తొలగించకపోవడంతో ఎస్ఐ ఓబులేష్, ఆర్ఐ బసవన్న గౌడ్, కేడీసీఎంఎస్ జిల్లా మేనేజర్ రాజేష్ కుమార్ దగ్గరుండి 11 బంక్‌లను తొలగించారు.... గోదాంకు లారీలు వచ్చేందుకు అవకాశం లేకుండా బంక్‌లు వేశారని, అలాగే గోదాంకు అనుకొని కొందరు బంకులు వేసి మద్యం సేవిస్తుండటంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఇక ఆలూరులో ప్రభుత్వ స్థలాల్లో వేసుకున్న బంక్‌లపై పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు దృష్టి సారిస్తున్నారు...

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 11 : నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం ముచ్చుమర్రి గ్రామంలో 8 ఏళ్ల బాలికను అత్యాచారం చేసి కిరాతకంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మిగనూరు పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించి సోమప్ప సర్కిల్‌లో ఆందోళన చేసి ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్భయ, దిశ చట్టాలు తెచ్చిన దేశవ్యాప్తంగా చిన్నారులు, మహిళల పైన అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి రూ 25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ నాయుడు, జావిద్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

ఆదోని (అగ్రికల్చర్) : ముచ్చుమర్రి గ్రామంలో బాలికపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినులతో కలిసి నిరసన తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను పకడ్బందీగా అమలు చేయకపోవడమే ఇలాంటి దుర్ఘటనలకు కారణమన్నారు. నాయకులు నాగరాజు, శశిధర్, గణేష్, సురేష్, యశ్వంత్, రాజు, ముని పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్నవిద్యార్థులు

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

ఆస్పరి, జూలై 11: బాలికను అత్యాచారం చేసిన మానవమృగాలను కఠినంగా శిక్షించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆలూరు తాలుకా కార్యదర్శి బోయ మునిస్వామి, టీఎన్ఎస్ఎఫ్ ఆలూరు తాలుకా అధ్యక్షుడు సిద్దప్ప కోరారు. వారు మాట్లాడుతూ బాలిక పై అత్యాచారం చేసిన ఘటనలో నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు ఎస్.మహేష్, ఓబులేషు, రామాంజనమ్మ, సావిత్రమ్మ, రామకృష్ణ, వీరేష్, మహానంది, భాస్కర్, కృష్ణ, సురేంద్ర, బాలకృష్ణ పాల్గొన్నారు.

యశోదా పాఠశాలలో విద్యాశాఖ అధికారుల విచారణ

పత్తికొండ, జూలై11: పత్తికొండ యశోదాగార్డెన్ అనుమతులపై శ్రీ చైతన్య పాఠశాలను నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై గురువారం ఎంఈవోలు తిమ్మారెడ్డి,రమేష్ విచారణ నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రిన్సిపాల్ అతిరా, అకడమిక్ డీన్ సుధాకర్ ను విచారించిన వారు తరగతులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. మీ పాఠశాలపేరు ఏమిటని విద్యార్థులను ప్రశ్నించగా కొందరు యశోదాగార్డెన్ అని మరికొందరు శ్రీచైతన్య అని సమాధానం ఇచ్చారు. విద్యార్థులు వేసుకున్న యూనిఫాంపై, పుస్తకాలపై శ్రీచైతన్య పేరు ఉండడం గుర్తించారు. అనంతరం కొందరు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్‌చేసి ఫీజుఎంతచెల్లిస్తున్నారో అడిగితెలుసుకున్నారు.

స్వర్ణ రథంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 11: రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథం పై భక్తులకు గురువారం దర్శనం ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథం పై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగాణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవలో భాగంగా ఉత్సవ మూర్తిని ఊయలలో ఉంచి ఊగించారు.

వైభవంతా వరధేంద్రతీర్థుల ఆరాధన : రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతులు శ్రీవరధేంద్రతీర్థుల ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బృందావనాన్ని అలంకరించి మూలరాములకు కనకాబిషేకాలు చేశారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ఎమ్మెల్యేలు :



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

గద్వాల, కర్ణాటక లోని బీజాపూర్ జిల్లా ముద్దెబీఎల్ ఎమ్మెల్యేలు కృష్ణామోహన్ రెడ్డి, సీఎస్ నాదాగౌడ వేర్వేరు సమయాల్లో రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి వారికి ఘనంగా స్వాగతం పలికారు.

ఆశావర్కర్ల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే పార్థసారథికి వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

ఆదోని టౌన్, జూలై 11: ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలసి మాట్లాడుతానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. ఈ మేరకు గురువారం తనను కలసిన ఆశావర్కర్లకు హామీ ఇచ్చారు. దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలను ఆశావర్కర్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రాధిక, ఇందిరాబాయి, జ్యోతి, హారిక, ధనలక్ష్మీ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం శ్రేయష్కరం

ఆదోని (అగ్రికల్చర్) : ప్రైవేట్ బస్సుల కంటే ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం శ్రేయష్కరం అని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. గురువారం ఆదోని డిపోలో ఆదోని-బెంగళూరు సర్వీస్ నూతన బస్సును డిపో మేనేజర్ రఫిక్‌తో కలిసి ప్రారంభించారు.

వాసంతి అదృశ్యంపై స్పందించండి

కోసిగి, జూలై 11: నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం, ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాల్మీకి బోయ మద్దిలేటి, సుజాత రెండో కూతురు వాల్మీకి వాసంతి (8) అదృశ్యంపై అధికారులు నిగ్గు తేల్చాలని వాల్మీకి న్యాయవాదుల రాష్ట్ర అసోసియేషన్ తరుపున విజ్ఞప్తి చేశారు. గురువారం జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నాగభూషణం నాయుడు అధ్యక్షతన కోసిగి, ఆదోని న్యాయవాదులైన బి.వీరేష్, సీ ఆనంద్ సమావేశంలో మాట్లాడుతూ 5వ తరగతి చదువుతున్న 8 ఏళ్ల వాసంతి మూడు రోజుల నుంచి అదృశ్యమైనా ప్రభుత్వం గానీ, పోలీసులు గానీ సరైన సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఇందుకు బాధ్యులైన ఎంతటి వారినైనా ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మాస్టర్ ప్లాన్ ఆమోదం కోసం కృషి చేయాలి

ఎమ్మిగనూరు, జూలై 11: ఎమ్మిగనూరు పట్టణం మాస్టర్ ప్లాన్‌ను ఆమోదం కోసం కృషిచేయాలని లైసెన్స్ టెక్నికల్ అసోషియేషన్ అధ్యక్షకార్యదర్శులు సైఫుల్లా, జగదీష్ కోరారు. ఈ మేరకు పట్టణ టీపీఓ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని సంఘం సభ్యులు కలిసి సన్మానించారు. అనంతరం సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. గత ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కొత్త ప్రభుత్వం లోనైనా మాస్టర్ ప్లాన్ అమలు కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ప్రసాద్, ఎల్లప్ప, సుజీత్, కామేష్ గౌడ్, వీరేష్‌లు పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాల సిబ్బంది పై డీఎస్‌డీవో ఆగ్రహం

ఆలూరు, జూలై 11: ఇండోర్ స్టేడియం పరిధిలో ఉన్న నాలుగు గదులకు నాలుగేళ్లుగా అద్దె చెల్లించకపోవడం ఏమిటని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి ఐటీఐ కళాశాల సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఇండోర్ స్టేడియం పరిధిలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. సకాలంలో అద్దెలు చెల్లించాలన్నారు.. ఎవరికి కేటాయించిన దుకాణాల్లో వారే ఉండాలని, ఎవరికైనా లీజుకు గాని, అద్దెకు ఇచ్చిన వారి షాపును రద్దు చేస్తామని వ్యాపారులను హెచ్చరించారు.

గుడిసెలు దగ్ధం

● భారీ ఆస్తినష్టం.. రోడ్డునపడ్డ కుటుంబాలు

హొళగుంద, జూలై 11: గ్రామ శివారులోని కడ్లేమాగి వద్ద ముసానపల్లె శంకరప్ప, మల్లయ్యలకు చెందిన రెండు గుడిసెలు గురువారం దగ్ధమయ్యాయి. బాధితుడు మల్లయ్యకు చెందిన బీరువాలోని రూ.5లక్షల నగదు, నాలుగు తులాల బంగారం, 25 తులాల వెండితో పాటు ఇళ్ల, పొలానికి చెందిన పత్రాలు కాలిపోయినట్లు తెలిపారు. అలాగే శంకరప్పకు చెందిన గుడిసెలో 3 క్వింటాళ్ల జొన్నలు, 3 క్వింటాళ్ల సజ్జలు, 6 సంచుల కందితో పాటు బట్టలు మొత్తం కాలి బూడిద అయినట్లు తెలిపారు. కట్టుబట్టలతో సహా రోడ్డు పై పడ్డామని కన్నీటిపర్యంతం అయ్యారు. ఆస్తి నష్టం సుమారు రూ.12 లక్షలకు పైగా ఉంటుందని బాధితులు వాపోయారు. సంఘటన స్థలాన్ని ఆర్ఐ దినేజ్, వీఆర్వో నాగరాజు పరిశీలించి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు సాగునీరు ఇప్పించండి



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న దేశాయి మాధవరావు

నందవరం, జూలై 11: గురురాఘవేంద్ర ప్రాజెక్టు, ఎత్తిపోతల పథకాలకు సాగునీరు ఇప్పించండని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరెడ్డిని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు కోరారు. గురువారం ఆయన ఎమ్మెల్యేను కలిసి సమస్యను విన్నవించారు. పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాలు రావడంలేదని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకుంటుందని, గురురాఘవేంద్ర ద్వారా రైతులకు సాగునీరు అందిస్తే పంటలు సస్యశామలమౌతాయని పేర్కొన్నారు. జీఆర్‌పీ రిపేరిలో ఉందని కలెక్టర్‌తో మాట్లాడి త్వరలో సాగునీరు వచ్చేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మాజీ జెడ్పీటీసీ ముగతి ఈరన్నగౌడు, ముగతి బార్గవ్‌యాదవ్, నదిక్తైరవాడి వీరేష్ ఉన్నారు.

ఎస్సీ హాస్టల్ పున: ప్రారంభించాలి

హొళగుంద, జూలై 11: హొళగుందలోని రాజానగర్‌లో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను పునః ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు మల్లికార్జున, ఏఐటీయూసీ నాయకుడు నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ ఎం ప్రసాద్ రాజాను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ హాస్టల్ ఉండేదని, వైసీపీ ప్రభుత్వం అందికారంలోకి వచ్చాక విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్నా కారణాలతో ఎస్సీ హాస్టల్‌ను మూసేశారని తెలిపారు.

ఇసుక పాలసీ సంతృప్తికరం

ఆదోని టౌన్, జూలై 11: రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రకటించిన ఇసుక పాలసీతో అసంఘటిత కార్మికులు, పేదలు సంతృప్తికరంగా ఉన్నారని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సామాన్యులు తాము అందించే తాయిలాల పైనే ఆధారపడాలన్న దుర్బుద్ధితో వైసీపీ ప్రభుత్వం ఇసుక రవాణాపై కఠిన నిబంధనలు అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేసిందని విమర్శంచారు.

విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన

ఆదోని టౌన్, జూలై 11: విద్యార్థులకు తమ ఇంటితో పాటు పరిసర ప్రాంతాల పరిశుభ్రతపై పూర్తి అవగాహన కలిగించాల్సిన అవసరం చాలా ఉందని మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఖానీమొహల్లా ప్రాంతంలో ఉన్న ఉర్దూ అండర్ పేట్ హైస్కూల్‌లోని విద్యార్థులకు పరిశుభ్రత ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. అనంతరం హైస్కూల్లో విద్యార్థులకు మధ్యాహ్నం అందిస్తున్న భోజనం, కోడిగుడ్డు, చిక్కిల గురించి అడిగి తెలుసుకొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటిన విద్యార్థులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 11 : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ భాష్యం స్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటారు. సూపరింటెండెంట్ మైత్రి మాట్లాడుతూ పర్యావరణ రక్షణలో భాగంగా మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. పిల్లలో మొక్కలపై ప్రేమ, బాధ్యత పెంచడం చాలా మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ,స్టాఫ్ నర్సులు, ప్రిన్సిపాల్ కవిత, అనురాధ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాతన పంచాయతీకి ట్రాక్టర్

తుగ్గలి, జూలై 11: గ్రామంలోని చెత్తా చెదారాన్ని డంపింగ్ యార్డులకు తరలించేందుకు ట్రాక్టర్ మంజూరైందని టీడీపీ తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షులు మనోహర్ చౌదరి, పంచాయితీ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని రాతన గ్రామంలో పంచాతీకి మంజూరైన ట్రాక్టర్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ ఈరన్నస్వామి, టీడీపీ నాయకులు కృష్ణమూర్తి చౌదరి ఉన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

ఎమ్మిగనూరు, జూలై 11: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నభోజనాన్ని అమలు చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 450కి పైగా జూనియర్ కళాశాలలు ఉన్నాయన్నారు. నాయకులు విష్ణు, హర్ష, అనంత్, హరీష్, ధనుష్, రంగస్వామిలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందిస్తాం

తుగ్గలి, జూలై 11: పొలాలు కౌలుకు చేసుకుని జీవనం సాగిస్తున్న కౌలు రైతులకు కార్డులు అందజేస్తామని తహసీల్దార్ షర్మిళ, ఏవో పవన్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయాధికారులు, వీఆర్వోలకు కౌలు రైతుల కార్డులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వీఆర్వోలు, వ్యవసాయాధికారులు రెవెన్యూ పరిధిలోని అన్ని గ్రామాల్లో కౌలు చేసుకుంటున్న కౌలు రైతు కార్డులను దరఖాస్తు చేయించి అర్హత ఉన్న వారికి కార్డులు అందించాలని సూచించారు. డీటీ నాగరాజు, ఆర్ఐ సుధాకర్ రెడ్డి, వీఆర్వోలు నాగేంద్ర, కాశీ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి

తుగ్గలి, జూలై 11: విద్యాశాఖలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి అంగడి లోకేశ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమగ్ర సర్వశిక్ష అభియాన్ లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలల పాటు జీతాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

దేవాలయానికి మైక్ సెట్ విరాళం

కౌతాళం, జూలై 11: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంకు గురువారం ఓ భక్తుడు మైక్ సెట్‌ను విరాళంగా అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి వారికి దేవాలయానికి కర్ణాటక రాష్ట్రం రాయచూరు పట్టణ వాస్తవ్యులు కుటుంబ సభ్యులతో కటకం సత్యనారాయణ వాసంతి కుటుంబ సభ్యులు రూ.70 వేల విలువ చేసే మైక్ సెట్‌ను దేవాలయ కార్యాలయం నందు అందజేశారు.

ఆగస్టు 2 నుంచి పీఠాధిపతి చాతుర్మాస దీక్షలు

మంత్రాలయం, జూలై 11: రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తన 13వ చాతుర్మాసదీక్షలు ఆగస్టు 2వ తేదీ నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు దీక్షలు చేపడుతారని మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. ఈ దీక్షల్లో ఉన్నంతకాలం మంత్రాలయం సరిహద్దులు దాటకుండా మంత్రాలయంలోనే ఉంటూ పూజలు చేస్తూ భక్తులకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ప్రతి జనసైనికునికి అండగా ఉంటా

మంత్రాలయం, జూలై 11: గత ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయానికి కష్టపడి పని చేసిన ప్రతి జనసైనికునికి అండగా ఉండి న్యాయం చేస్తానని మంత్రాలయం జనసేన ఇన్‌చార్జి, ఐక్యవాల్మీకి పోరాట కమిటి రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ బి.లక్ష్మన్న అన్నారు. గురువారం మంత్రాలయం జనసేన పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాల నాయకులతో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సులేకేరి గ్రామానికి చెందిన రాంబాబు, దేవదాసు, లింగన్నతో పాటు మరి కొంత మంది జనసేన పార్టీలో చేరారు. వీరికి లక్ష్మన్న పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

తప్పిన ప్రమాదం

దేవనకొండ ,జూలై 11 : రోడ్డుపై వున్న గుంతని తప్పించబోయి బ్రేక్ వెయ్యడంతో అదుపుతప్పి ప్రమాదంలో కారు బోల్తా పడింది. కర్నూలు-బళ్లారి రహదారిపై వేగంగా వచ్చే వాహనదారులకు సమీపంలోకి వచ్చేంతవరకు కూడా రోడ్డుపై గుంత కనపడదు. గురువారం కర్నూలుకు చెందిన ఏపీ 31 సీఎం 7831 వాహనం రోడ్డుపై గుంతని గమనించక సడన్‌గా బ్రేక్‌వెయ్యడంతో అదుపుతప్పి కారు నాలుగు పల్టీలు కొట్టిన్నట్లు సమీపంలో ప్రజలు తెలిపారు. కారులో ఇద్దరు ప్రయాణిస్తుండగా ఒకరికి స్వల్పగాయాలై ప్రమాదం నుండి బయటపడ్డారు.